

**జీవితంలో ప్రయారిటీలు తేల్చుకోలేని నవతరంలో కొందరి కథ**

# రైలుపట్టాలు

## సన్నిహిత్

"డాడీ! ఆకలేస్తోంది అన్నం పెట్టు" హాల్లోనుండి నా కొడుకు రాహుల్ ఆర్డరేసాడు. ప్లేట్లో అన్నం, పప్పు పెట్టుకొని హాల్లోకి వచ్చాను. ముద్దలు కలిపి వాడికి తినిపించడం ప్రారంభించాను. అయిదేళ్ళ పిల్లాడువాడు. అయినా ముద్దలు చేసి తిని పిస్తే తప్ప తినడు. తనకు తానుగా తినడం అనేది వాడు నేర్చుకోలేదు. మేము నేర్ప లేదు. "నా బంగారు తల్లివి కదమ్మా! తినమ్మా తిను" అని బ్రతిమిలాడడానికి వాడి కన్నతల్లి కూడా ప్రస్తుతం ఇక్కడ లేదు. ఎక్కడో ఏడేడు సముద్రాలకావల అమెరికాలో ఉంది.

'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది' అంటూ సెల్‌ఫోన్ రింగ్ అవుతోంది. నాకు బాగా ఇష్టమైన పాట అది. అందుకే రింగ్ టోన్‌గా సెట్ చేసుకున్నాను. లిఫ్ట్ చేసి "హలో!" అన్నాను.

"హలో! నేనూ సుప్రియను. ఏం చేస్తున్నావు గురూ! వంటా వార్పుల్లో మునిగిపోయావా?" అటునుండి నవ్వుతోంది.

"అంతకంటే ఏం చేస్తాను. నేనేం బేచిలర్నా! పబ్‌లకి, డిస్కోథెక్‌లకీ వెళ్ళడానికీ, రోడ్డు మీద పడి తిరగడానికీనూ!" వెక్కిరించాను.

"ఏయ్ మరీ ఎక్కువవుతోంది. ఆపేయ్! సరే! సరే! ఇంటికి రానా?" అర్థింపుగా అడిగింది.

"రండి మేడమ్! మీకేంటి అభ్యంతరం" ఆహ్వానించాను. ఎందుకో ఆ క్షణంలో సడన్‌గా దూకే 'జలపాతం' గుర్తొచ్చింది నాకు.

* * *

వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ని! నెలకు లక్ష రూపాయల జీతం!

హైదరాబాద్‌లో ఒక సొంత ఇల్లు, కారు నా ఆస్తులు.

చెప్పుకోదగ్గ సమస్యలేవీ లేని స్మూత్ జీవితం నాది. సుప్రియ నా కొలీగ్! ఐదడుగుల నాలుగంగుళాల ఎత్తు, పచ్చని మేని ఛాయ. అదిరిపోయే స్ట్రక్చర్ ఆమె సొంతం. చూడగానే ఎక్కడో జివ్వుమంటుంది. ఆమెతో మాట్లాడాలని మనసు ఉవ్విళ్ళూరుతుంది. కానీ ఎవడ్ని ఎక్కడుంచాలో ఆమెకి బాగా తెలుసు. అందుకే నాకు స్నేహితురాలయింది. కాలింగ్ బెల్ కొట్టకుండానే నా ఫ్లాట్ లోపలికొచ్చి నా కొడుకుతో ఆడుకోవడంలో మునిగిపోయింది సుప్రియ. ఎందుకో ఆ దృశ్యం అపురూపంగా అనిపించింది నాకు. చాలాకాలంగా తల్లి దగ్గర లేకపోవడంతో రాహుల్ కూడా ఆమె సాన్నిహిత్యాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నాడు.

రాహుల్ భోజనం పూర్తయ్యింది కాబట్టి నేను కూడా లంచ్‌కి సిద్ధమయ్యాను.

"సుప్రియా! నువ్వు కూడా రా! భోం చేద్దువుగాని" ఆహ్వానించాను.

"ఓకే! రడీ!" అంటూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చొని, చొరవగా నాక్కూడా వడ్డించడం ప్రారంభించింది. చాలా ముచ్చటగా అనిపించింది నాకు. ఆమెను నాతో స్నేహం చేయమని ఏ రోజూ నేను అడగలేదు. ఆమెమీద ఎటువంటి ఇంట్రెస్టూ చూపించలేదు. చాలా కాజువల్‌గా మాట్లాడేవాడిని. కానీ ఈమధ్యే నా భార్య నన్ను వదిలి దూరంగా వెళ్ళిపోయాక, ఆమె నాకు మరింత దగ్గరయింది. నేను 'వద్దు' అనలేనంత దగ్గరగా వచ్చేస్తోంది. మా పరిచయం ఎటు దారితీస్తుందో అనే భయం మొదటిసారిగా నా మనసు మూలలో ఎక్కడో కదిలింది.

లంచ్ అయ్యాక రాహుల్‌తో కేరమ్స్ ఆడటంలో మునిగిపోయింది సుప్రియ. నేను కంప్యూటర్ ముందు కూర్చొని 'మెయిల్స్' చెక్ చేయడం ప్రారంభించాను. చాలామటుకు జంక్ మెయిల్స్. అన్నీ డిలీట్ చేసి నా భార్య పంపిన మెయిల్ చదవసాగాను.

"డియర్!

నేను దూరంగా ఉండటం వలన నీవు హాయిగా ఉన్నావని అనుకుంటున్నాను. నీవు కోరుకున్న జీవితం ఇదే కదా! ఇప్పుడు నీ కెరీర్‌పై మరింత శ్రద్ధ పెడుతున్నావు కదా! ఆల్ ద బెస్ట్! నీవు మరింత వృద్ధిలోకి రావాలని ఆశిస్తూ.."

చదవటం పూర్తి చేసి అలసటగా వెనక్కువాలి కళ్ళు మూసుకున్నాను. గతం గుర్తొచ్చింది. అసలు ఆరోజు అలా ఎందుకు జరిగిందో ఇప్పటికీ నాకు అర్థం కాదు.


* * *

"సురేష్! అర్జెంటుగా ఇంటికి రా! రాహుల్‌కి బాగా జ్వరంగా వుంది" ఫోన్లో నా భార్య కంగారుగా అంది. వాచీ చూసుకున్నాను. సాయంత్రం ఆరు కావస్తోంది. ఆఫీసులో కంప్యూటర్ ముందు కూర్చొని ప్రెజెంటేషన్స్‌కి కావాల్సిన స్లైడ్స్ అన్నీ పవర్‌పాయింట్‌లోకి మారుస్తున్నాను. అరగంటలో మా బిగ్‌బాస్‌తో మీటింగ్ ఉంది. ఎప్పటినుండో అనుకుంటున్న చాలా ఇంపార్టెంట్ మీటింగ్ అది. మధ్యలో ఈ ఫోన్ కాల్! తల తిరిగిపోయింది నాకు. అసలే ప్రమోషన్ ఇంటర్వ్యూ ఫేస్ చెయ్యాల్సిన టైము ఇది.

ఎటూ తోచని స్థితిలో "సాయంత్రం మీటింగ్ ఉందని నీకు పొద్దున్నే చెప్పాను కదా! ఎందుకిలా విసిగిస్తావు" కసురుకున్నాను.

"రాహుల్‌కి జ్వరం వస్తుందని నేనేమైనా కలగన్నానా? అయినా అవన్నీ నాకు తెలియవు. ఇమ్మీడియట్‌గా ఇంటికి రా! వాడ్ని తీసుకుని హాస్పిటల్‌కి వెళ్దాం!" ఆర్డరేసి ఫోన్ పెట్టేసింది నా భార్య.

ఆఫీసు నుండి పరుగెత్తుకుంటూ ఇంటికొచ్చేసరికి రాహుల్‌కి తడిబట్టతో స్పాంజింగ్ చేస్తోంది. టెంపరేచర్ నూట మూడు ఉంది వాడికి. మధ్యాహ్నం వరకు బాగానే ఉన్నాడంట. ఈవెనింగ్‌కి సడన్‌గా వచ్చింది ఫీవర్. అయినా చిన్నపిల్లల ఆరోగ్యం గురించి చెప్పేదేముంది? అయితే నా మానసిక పరిస్థితి ఇవేవీ ఆలోచించే స్థితిలో లేదు. ఆఫీసులో ఇంపా



రెంట్ మీటింగ్ స్కిప్ చేసి రావడం వల్ల నా ప్రమోషన్‌కి దెబ్బ అవుతుందేమో అన్న భయం, "ఇంత చిన్న విషయానికి నా భార్య నన్ను కంగారుపెట్టాలా" అన్న ఒళ్ళు మంట దీనికి కారణం. వస్తూనే విరుచుకుపడ్డాను.

"అదేంటి చిన్న జ్వరం వస్తేనే నాకు ఫోన్ చేసి హడావుడి చేయాలా? హాస్పిటల్‌కి తీసుకెళ్ళలేవా?" గట్టిగా అరిచాను.

"అదే ప్రశ్న నేనూ అడుగుతున్నాను. నేను కూడా నీలాగే జాబ్ చేస్తున్నాను కదా! ఇంట్లో పని చూసుకోవాలి. ఆఫీసులో పని చూసుకోవాలి. నేను ప్రతీరోజూ పొద్దున్న ఆఫీసుకు వెళ్ళేటప్పుడు రాహుల్‌ని స్కూలులో దింపాలి. స్కూలు అవగానే బేబీకేర్ సెంటర్‌కి తీసుకెళ్ళాలి. సాయంత్రం ఇంటికి తీసుకొచ్చి హోమ్ వర్క్ చేయించాలి. అటుపైన వంట చేయాలి. ఎప్పుడో పొద్దున్న పదింటికి ఆఫీసుకు వెళ్ళినవాడివి, రాత్రి పదింటిదాకా ఇంటి ముఖం చూడవు. ఆఫీస్‌లో బాగా కష్టపడాలి, కెరీర్‌లో పైకి రావాలి అంటావు. నేను మాత్రం ఇల్లూ, వాకిలీ చూసుకుంటూ, ఆఫీసులో కొంత మేరకే పని చేస్తూ కెరీర్‌ని వదులుకున్నా ఫర్వాలేదు. జాబ్ మానేస్తానంటే వద్దంటావు. డబ్బు సంపాదించాలి అంటావు. కెరీర్‌లో నువ్వు పైకి వెళ్తూ సంతృప్తిగా ఉండాలి. నేను మాత్రం అన్నీ వదులుకుని అసంతృప్తిగా ఉండాలి. అసలు నీ కోసం నేనెందుకు ఇన్ని త్యాగాలు చేయాలి?" నాకంటే గట్టిగా అరిచింది. దెబ్బతిన్నట్టు చూసాన్నేను. ఏడ్చింది. గోల పెట్టింది. ఆ తర్వాత మా మధ్య పెద్దయుద్ధమే అయింది.

రాహుల్‌కి జ్వరం పెరిగి ఫిట్స్‌లా ప్రారంభం అయ్యాయి. కంగారుగా వాడ్ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళాం. ట్రీట్‌మెంట్ చేసాక వారం రోజులకి గానీ వాడు మామూలు మనిషి కాలేదు. తప్పంతా నాదే అని, నా నిర్లక్ష్యమే వాడి అనారోగ్యానికి కారణం అనీ నా భార్య తేల్చింది. కుటుంబ బాధ్యత నా నెత్తిమీద ఉంటే సరి అవుతానని తీర్మానించి, తాను మాకు దూరంగా వుండాలని నిర్ణయించుకొని, అమెరికాలో జాబ్ చూసుకొని "మళ్ళీ కలుస్తా" అంటూ ఎగిరిపోయింది. కట్ చేస్తే నేనూ, నా కొడుకు మిగిలాం. ఒంటరిగా..నాకు భార్యలేక..వాడికి తల్లిలేక.

* * *

"డాడీ డాడీ" అంటూ రాహుల్ దగ్గరకు రావడంతో నా ఆలోచనలకు బ్రేక్ పడింది.

"డాడీ! ఆంటీ సినిమాకు వెళ్దామంటోంది. రడీ అవండి" ముద్దుగా అడిగాడు.

"ప్లీజ్ ఓకే అనండి" కళ్ళతోనే అర్థించింది సుప్రియ. కాదనలేకపోయాను. అందరం కలిసి కారులో ఐమాక్స్‌కి బయలుదేరాం. పావుగంట డ్రైవ్ తర్వాత థియేటర్ దగ్గర ఉన్నాం. పెద్దగా రష్ ఏమీ లేదు. టికెట్లు తీసుకొని లోపలికెళ్ళాక, సుప్రియకు నాకు మధ్యలో రాహుల్ కూర్చున్నాడు. ఏదో గ్రహాంతర వాసులకు సంబంధించిన సినిమా. రాహుల్, సుప్రియ ఇద్దరూ బాగానే ఎంజాయ్ చేసారు.

సినిమా చూసి తిరిగి వస్తూండగా సుప్రియ సెల్ రింగ్ అయింది. ఆమె పేరెంట్స్ దగ్గరనుండి ఫోన్ అనుకుంటా. ఎందుకోగానీ చాలా విసుక్కుంటూ మాట్లాడింది. విషయమేంటని ఆరా తీసాను.

"నథింగ్ సురేష్! ఇంట్లోవాళ్ళు నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. పెళ్ళి కొడుకు మహానుభావుడు కూడా నాలాగే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. బెంగుళూరులో వర్క్ చేస్తున్నాడు. నా ఫోటో చూసి 'ఇష్టమే' అని చెప్పాడంట. అయితే ఒక కండిషన్ పెట్టాడు. పెళ్ళి

తర్వాత నేను జాబ్ మానేసి ఇంట్లో ఉండాలంట. 'ఇల్లే ఇలలో స్వర్గమనీ, ఇల్లాలే ఇంటికి దేవతనీ..' అని పాడుకుంటూ బ్రతకాలంట. కుర్రాడు అందంగా ఉన్నాడు. మంచి జాబ్‌లో ఉన్నాడు, చేసుకోవే...అంటూ ఇంట్లో వాళ్ళు ప్రాణం తీస్తున్నారు. నా మెంటాలిటీ నీకు తెలుసుకదా! ఇంత చదువు చదువుకొని, ఏ జాబ్ లేకుండా ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ ఎలా వుండాలి? నువ్వే చెప్పు. ఐ షుడ్ హేవ్ మై ఓన్ కెరీర్ యార్!" అంటూ ఆవేశంగా చెప్పింది. ఈ తరం అమ్మాయిలకి ప్రతినిధిలా!

నేను సమాధానం చెప్పకుండా నిశ్శబ్దంగా డ్రైవ్ చేయసాగాను. ఇంటికి చేరుకున్నాక డిన్నర్ చేసి నిద్రకుపక్రమించాం. సుప్రియను ఆమె ఫ్లాట్‌కి వెళ్ళమన్నాను. వెళ్ళనంది. మా ఇంట్లోనే పడుకుంటానంది. వద్దనలేదు నేను. రాహుల్‌ని దగ్గరగా తీసుకొని మా బెడ్రూమ్‌లో నా బెడ్ పైన పడుకుంది.

భార్యకు దూరమై ఒంటరిగా ఉన్న నేను ఆమెను ఏమైనా చెయ్యొచ్చు అన్న భయం మచ్చుకైనా లేకుండా నిశ్చింతగా వాడితో కబుర్లు చెబుతూ వుంది. అదే రూములో పడుకోవడం సంస్కారం కాదు కాబట్టి హాల్లో సోఫాలో కూర్చుని పుస్తకమేదో చదువుకుంటూ అలాగే నిద్రపోయాను.

★ ★ ★


వెచ్చటి ఉషాకిరణాలు మొహం మీద పడేసరికి మెలుకువ వచ్చింది. బాత్రూమ్‌కి వెళ్తూ బెడ్రూమ్‌లోకి తొంగి చూసాను. రాహుల్, సుప్రియ ఇంకా నిద్రలేవలేదు. నవ్వుకుంటూ బాత్రూమ్‌లోకి వెళ్ళాను. సింక్ దగ్గర అద్దానికి ఒక తెల్లకాగితం ఆకర్షించింది నన్ను. తీసి చూసాను. తెల్లటి కాగితంమీద అందమైన నల్లటి అక్షరాలు.

"డియర్ సురేష్!

ఆకర్షణకులోనై, అదే ప్రేమనుకొనే అడాలసెంట్ స్టేజ్ నేను ఎప్పుడో దాటి పోయాను. నీమీద నాకు ఏదో తెలియని ఇష్టం ఏర్పడింది. బహుశా అది నీ సింప్లిసిటీ. ఏదేమైనా నీతో కలిసి బ్రతకాలనుకుంటున్నాను. అవకాశమిస్తావా?

-ప్రేమతో

సుప్రియ"




నవ్వొచ్చింది నాకు. నా మనస్తత్వం నచ్చక, నా మీద అయిష్టతతో నా భార్య నన్ను విడిచి దూరంగా బ్రతుకుతుంటే, ఈ అమ్మాయి నా మీద ఇష్టంతో దగ్గరవుతానంటోంది. ఏమిటీ భిన్న మనస్తత్వాలు? నిజానికి నేను, నా భార్య, సుప్రియ అందరం మేధావులమే! నేటి సమాజం తయారుచేసిన ధీరోదాత్తులం. ధైర్యం, తెలివితేటలు, సంపద అన్నీ ఉన్నాయి మాకు. కానీ బ్రతకడమే చేత కాదు. బలహీనమైన మానవ సంబంధాలు. మేడిపండులాంటి జీవన విధానం. ఎన్నటికీ కలుసుకోని రైలు పట్టాల్లాంటి మనస్తత్వాలు!

ఎప్పుడు లేచిందో తెలియదు, రాహుల్ నుదుటి మీద ముద్దుపెట్టుకుంటూ వెళ్ళడానికి సంసిద్ధమయింది సుప్రియ.

వెళ్తూ, వెళ్తూ ఒక మాట కూడా అడిగింది. "సురేష్! నా గురించి ఏం ఆలోచించావు?" అని.

తడుముకోకుండా, వెంటనే సమాధానమిచ్చాను..."ఏమీ ఆలోచించలేదు. ఆలోచించలేను కూడా! అంత ఓపిక లేదు. నన్నిలా బ్రతకనీ" అని.

ఏమనుకుందో మాట్లాడకుండా వెళ్ళిపోయింది నా భార్యలాగే!




నగ్మా కాంగ్రెస్ పార్టీలో చేరింది. పోటీ చేయడానికి కూడా రెడీ అయింది. మరో బాలీవుడ్ భామ అమీషా పటేల్ కూడా ఎన్సీపీ తరపున గుజరాత్‌లోని నియోజకవర్గం నుంచి పోటీ చేస్తోందనే వార్తలు గుప్పుమన్నాయి. కానీ దీన్ని వెంటనే ఖండించింది అమీషా. 'నాకు రాజకీయాలంటే ఎలాంటి ఇంటరెస్ట్ లేదు ప్రస్తుతానికి. భవిష్యత్తులో ఏమో చెప్పలేను. ఇప్పుడు మాత్రం నేను పోటీ చేయడం లేదు' అంటూ సెలవిచ్చింది. అంటే కాస్తో కూస్తో రాజకీయాలంటే ఆమెకి ఆసక్తి వున్నట్టే కదా! అని గుసగుసలాడుతున్నారు బాలీవుడ్ జనాలు.